# తోకాభిరామాయణం

**అన్నం తినకుండా అయినా బతకొచ్చేమో కానీ, అబద్ధం చెప్పకుండా బతకలేని రోజులివి. మరి ఇలాంటి రోజుల్లో అబద్ధం చెబితే తోక పెరిగితే బతకడమెట్లా చెప్మా!**

నాన్నా, ఇషితా వాళ్ళ ఇంట్లో ఓ చిన్న పాప వచ్చింది. బొమ్మలా ఉంది. ముట్టుకోబోతే వాళ్ళమ్మ కోప్పడింది." సంబరంగా చెప్పుకొచ్చింది మా ఏడేళ్ళ అపూర్వ. ఇషిత తన క్లాసుమేటు. కాలనీ మేటు కూడాను.

"అవునా! ఆర్నెల్లాగండి. పాప పెద్దదయ్యాక ఆడుకోవచ్చు." తన సంబరంలో పాలు పంచుకొనే ప్రయత్నం చేశాను.

"సరేగానీ నాన్నా, పిల్లలెలా వస్తారూ? హాస్పిటల్‌లో ఇచ్చారని చెపుతోంది ఇషిత."

అనుకోని ప్రశ్న. మింగుడు పడలేదు. అయినా, తమాయించుకొన్నాను.

"దేవుడిస్తాడు. శాంతాక్లాస్ టాఫీలు, చాక్లెట్లూ ఇవ్వడూ? అలాగే దేవుడికి మనవంటే బోలెడంత సంతోషం వేసినప్పుడు పిల్లల్ని ఇస్తాడు." బాగా అరిగిపోయిన అబద్ధాన్నే మరోసారి వినిపించాను.

వెన్నుపూస చివర జలదరించింది. వంద వోల్టుల వైరుముక్క తగిలించి స్విచ్చి వేసినట్టు అనిపించింది.

అర్థమయింది.

అదీ మరో అర మిల్లీమీటరు పెరిగిందన్నమాట.

మూడ్ పాడైపోయింది.

దసరా సెలవుల్లో సరదాగా వారం రోజుల పాటు ఢిల్లీ వెళ్ళివద్దామని ఉత్సాహంగా పెట్టెలు సర్దుతోన్న నాకు ఈ అర మిల్లీమీటరు పెరుగుదల- చన్నీళ్ళు గుమ్మరించినట్టనిపించింది. మనసు వికలమయింది.

ఏం చెయ్యడం? ఈ సమస్యకు విరుగుడుందా? ప్రపంచంలో ఎవరికీ లేని సమస్య నాకే ఎందుకు రావాలీ? ఏవిటీ నేను చేసిన పాపం? ఎవరితోనూ చెప్పుకోలేను. డాక్టర్‌కు చూపించుకోలేను. కనీసం జీవిత సహచరితో కూడా పంచుకోలేని విషాదమిది! తనకు తెలుసా? అక్కడికీ ఒకటి రెండు సార్లు గమనించి అడిగింది. వాచిందనో, కాయ కాచిందనో చెప్పి మాట దాటేశాను.

ఈనాటిదా ఈ సమస్య! పదిహేనేళ్ళవలేదూ?

ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఇస్తున్నప్పుడు తగిలింది మొదటి షాకు. ఏదో ప్రశ్నకు - నాకు సమాధానం తెలియకపోయినా - తెలివిగా ఊహించి అవతలి వాళ్ళు నమ్మతగ్గట్టుగా అబద్ధం చెప్పాను. వెన్నుపూస జలదరించింది.

మరో ప్రశ్న. మరో అబద్ధం. మరో జలదరింపు.

జలదరింపులకు కారణం అర్థంగాలేదు. మనసు లోని అలజడే జలదరింపులు పుట్టిస్తోంది గాబోలు అనుకొన్నాను. ఆనాటి ఇంటర్వ్యూ ముగిసేసరికి ఏడెనిమిది జలదరింపులు. సాయంత్రం స్నానం చేస్తున్నప్పుడు చూసుకొంటే వెన్ను చివర చేతికి తగులుతోన్న బొడిపె. అప్పటికీ బోధపడలేదు. అబద్ధాలకూ, జలదరింపులకూ, బొడిపెకూ మధ్యనున్న సంబంధం అర్థంగాలేదు.

కానీ, అర్థంగావడానికి ఎంతో సమయం పట్టలేదు.

ఇంటర్వ్యూలో సెలెక్టయి హైదరాబాదు చేరాను. పరిచయం లేని ఊరు. ఇల్లూ వాకిలీ, చాపా చెంబూ- సమస్తం సమకూర్చుకోవలసి వచ్చింది. అద్దె ఇంటి కోసం కులం గురించీ, కుటుంబం గురించీ, ఆహారపుటలవాట్ల గురించీ టకటకా అబద్ధాలు చెప్పాల్సి వచ్చింది. ఒక్కో అబద్ధానికీ ఒక్కో జలద రింపు. అలా ఆ అబద్ధాల పరంపర కొనసాగి ముగిసే సరికి జరగవలసిన ప్రమాదం జరిగిపోయింది.

నాకు రెండున్నర అంగుళాల తోక పుట్టుకొచ్చింది. వాపు వాయడమో, కాయ కాయడమో గాదు - అది అసలు సిసలు తోక అన్న విషయం బోధపడింది. లక్షలాది సంవత్సరాల క్రితం మన పూర్వీకులు మానవ జీవన పరిణామక్రమంలో క్రమక్రమంగా వదిలించుకొన్న తోకను నేను మళ్ళా తగిలించు కొన్నానని అర్థమయింది. గుండె గుభేలుమంది.

అప్పటికి నాకు ఇరవై మూడేళ్ళు. ఆ ఇరవై మూడేళ్ళలోనూ కనీసం ఇరవై మూడు వేల అబద్ధాలు చెప్పి ఉంటాను. మరి అన్నేళ్ళూ జరగని అనర్థానికి ఆ ఇంటర్వ్యూ నాడే ఎందుకు అంకురార్పణ జరిగినట్టూ?

ఆలోచించగా సమాధానం తట్టింది.

పసితనమూ, విద్యార్థి జీవితమూ అంటే అమాయకపు బతుకు. పరాధీనపు బతుకు. మన చర్యలకూ, చేష్టలకూ మనం పూర్తిగా బాధ్యులం గాని బతుకు. మన తప్పొప్పులకూ, బాగోగులకూ తల్లితండ్రులో, ఉపాధ్యాయులో బాధ్యత వహించ వలసిన సమయం. అందుకే దేవుడు నా అబద్ధాలన్నిట్నీ క్షమించాడు. కానీ, విద్యార్థి జీవితం ముగించి బాధ్యత గల ఉద్యోగిగా అవతరించబోతోన్న క్షణాల్లో దేవుడు ప్లేటు ఫిరాయించాడు. నాకో తోకను తగిలించాడు.

అబద్ధం చెప్పినప్పుడల్లా ఆ అబద్ధపు తీవ్రతకు అనుగుణంగా అణుమాత్రమో, అర మిల్లీమీటరో తోక పెరుగుతుంది. అలాగే నిజం చెప్పినప్పుడల్లా తోక తరగనూ తరుగుతోంది. ప్రకృతిలో సమతుల్యం కోసం ఏదీ శ్రుతిమించి పెరగకుండా- ప్రకృతే జాగ్రత్తపడుతోన్న విధంగా నా తోక కూడా అవధులు దాటి పెరిగిపోకుండా నిజాలు చెప్పినప్పుడల్లా తరిగే నదుపాయం అంటే- రాయితీ కల్పించినందుకు మాత్రం దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నిజాలూ అబద్ధాల

**వెన్నుపూస చివర జలదరించింది. అర్థమయింది. అదీ మరో అర మిల్లీమీటరు పెరిగిందన్నమాట.**

మధ్య అనునిత్యం ఊగిసలాడే నా తోక నిడివి సగటున రెండు అంగుళాలు. అడపాదడపా అది మూడు అంగుళాలకు చేరడమూ, అబద్ధాల అవసరం పడని శుభదినాల్లో ఒక్క అంగుళానికే పరిమితం అవడమూ జరిగినా, సగటున దాని నిడివి రెండంగుళాలు.

వింత సమస్య. విపరీత సమస్య. 'ఎవరీతో మొరలిడుదూ' అంటూ సశాస్త్రీయంగా ఆక్రోశించడానికి నేను త్యాగరాజును కాను. 'లావొక్కింతయు లేదు' అంటూ మొరపెట్టుకోగానే సిరికిం జెప్పకుండా మహా విష్ణువు వచ్చి చక్రం అడ్డేసి నా తోక తెగ్గోయడానికి నేను కరిరాజునూ గాదు. అంచేత సమస్యతో సహజీవనం చేసే సంయమనం అలవరచుకొన్నాను. విషయం మూడో కంటికి తెలియకుండా జీవనయానం సాగిస్తున్నాను. అయినా, అప్పుడప్పుడూ దిగులు పుడుతూనే ఉంటుంది. 'ఎన్నాళ్ళీ రహస్యపు బతుకూ' అన్న ప్రశ్న వేధిస్తూనే ఉంటుంది. పుట్టుకతో పుట్టిన బుద్ధులు పుడకల దాకా పోవంటారు. బహుశా నా తోక వల్లకాటి దాకా తోడొస్తుందేమో!

*　　*　　*

సాయంత్రం ఢిల్లీ బండెక్కాలి. అయినా, పగలంతా ఆఫీసు పని తప్పలేదు. మా బాసు మహా చాదస్తుడు. సెలవడిగితే భయపడతాడు. సస పెడతాడు. వారం రోజులు సెలవు మంజూరు చేయించు కోవడానికి తోకను ఇప్పటికే రెండు మిల్లీ మీటర్లు పెరగనివ్వాల్సి వచ్చింది.

సాయంత్రం బండెక్కాలంటే మూడింటికయినా పర్మిషను తీసుకొని ఇంటికి చేరడం అవసరం.

"అసలే వారం రోజులు సెలవు. మళ్ళా ఈ పర్మిషనేవిటండీ." గొణిగాడు బాసు.

"సామాన్లు సర్దుకోవాలి సార్. టైము చాలదు." ప్రాధేయపడ్డాను.

"అదేదో పొద్దున్నే ముగించుకోవాలి. పర్మిషను దొరక్కుండా ఎక్కడికి పోతుందిలే అన్న ధీమా మీది. ఆఫీసంటే అంత అలుసయితే ఎలా?" సస మొదలెట్టాడు.

ఒళ్ళు మండింది. అయినా, ఏం చేస్తాం. పొద్దున్నే మా పాపకు అబద్ధం చెప్పి తోక పెంచుకొన్నాను గదా, దాంతో మూడ్ పాడయింది. పెట్టెలు సర్దడం ఆపేశాను. ఇప్పుడు పర్మిషన్ తీసుకొని వెళ్ళకపోతే బండి నడవదు.

"నిజమే సార్. పొద్దున్నే సర్దుకొని ఉండాల్సింది. మొదలెట్టా కూడా. సడన్‌గా మా పాప కడుపు నొప్పని గిలగిలలాడింది. సర్దడం ఆపి డాక్టరు దగ్గరికి పరిగెత్తా పని మిగిలిపోయింది." అవలీలగా కథ అల్లాను.

పర్మిషన్ దొరికింది. తోక పెరిగింది.

*　　*　　*

బండి వింధ్యారణ్యాల మధ్యలోంచి మంద్రంగా సాగుతోంది.

మా ముగ్గురికీ ఉత్తర భారతం కేసి అడుగు వెయ్యడం ఇదే మొదటిసారి. ఉత్తేజకరంగా ఉంది. నాగపూర్ లాంటి ఊళ్ళు, చిన్నప్పుడు పుస్తకాల్లో చదవుకొన్న మహారాష్ట్రం, మధ్య ప్రదేశ్, అర్థమయ్యీ అర్థంగాని హిందీ భాష, దట్టమైన అడవులు, పచ్చని కొండలు, చీకటి సొరంగాలు, చిన్నచిన్న సెలయేళ్ళు- ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంది.

"టికెట్ ప్లీజ్." టి.టి.ఇ గొంతు.

చూపించాను.

"మీ పాపకెన్నేళ్ళు?"

"అయిదు." అర మిల్లీమీటరు పెరుగుదలకు సిద్ధపడిపోయాను.

అపూర్వ నాకేసి ఆశ్చర్యంగా చూసింది. తనకు చాలా నమ్మకం- పెద్దదాన్నయిపోయానని. ఆరిందాలా మాట్లాడుతుంది. తన వయసు ఏడేళ్ళని తనకు స్పష్టంగా తెలుసు. ఎవరన్నా తక్కువ చేసి మాట్లాడితే అరచి గీపెట్టి సరిదిద్దుతుంది. అలాంటిది నేను ఏ సంకోచమూ లేకుండా

'అయిదు' అనేనరికి అవాక్కయిపోయింది. నోరు విప్పబోయింది. కంటి చూపుతో వారించాను.

"బేటీ, క్యా నామ్ హై తుమ్హారా? కౌన్‌సీ క్లాస్ మే పఢ్‌తే హో?" మృదువుగా కదిపాడు టి.టి.ఇ.

"అపూర్వ. సెకండ్ క్లాస్. బీ సెక్షన్." మా ఆరిందా రెచ్చిపోయింది.

"ఏం సార్. ఎందుకీ అబద్ధాలు? సెకండ్ క్లాసంటే ఏడేళ్ళన్న మాట. ఇలాంటివి వినీ వినీ మా తల పండిపోయింది. నిజాలు తెలుసుకోవడానికి మా పద్ధతులు మాకు ఉంటాయి." మెత్తగా జాడించాడు టి.టి.ఇ. బుద్ధిగా ఎక్సెస్ ఫేర్ కట్టేశాను. ఫైను పడలేదు. పరువు పోయింది. ఎంతో కొంత డబ్బూ వదిలింది.

ఓ పావు మిల్లీ మీటరు మాత్రం మిగిలింది.

* * *

ఢిల్లీ చేరాం. మా హైస్కూల్ క్లాసుమేటొకడు గత పన్నెండు ఏళ్ళుగా పాతుకుపోయి ఉన్నాడక్కడ. సెంట్రల్ సెక్రటేరియట్లో స్టెనోగ్రాఫరు వాడు. ఆర్.కె. పురం క్వార్టర్స్‌లో నివాసం.

చాలా సంవత్సరాల తర్వాత కలిశాం గదా- తరగనన్ని కబుర్లు. బ్యూరాక్రాట్ల మధ్యన గదా వాడి ఆఫీను పని - వాడి పొట్ట నిండా కథలూ, కబుర్లూ. బోఫోర్స్ నుంచి బంగ్లాదేశీయుల డిపోర్టేషన్ దాకా- వాడిది అనంత పరిజ్ఞానం. వాడూ, వాళ్ళ కొలీగ్సూ ఆఫీనులో ఆడే నాటకాలూ, వాళ్ళవాళ్ళ అయ్యేయస్ బానుల్ని బురీడీలు కొట్టించే వైనాలూ వింటోంటే గంటలు గంటలు గడిచిపోయాయి. వీళ్ళందరికీ దేవుడు తోకలను ప్రసాదించి ఉంటే అవి మూడు మైళ్ళ నిడివికి చేరి గిన్నిస్ బుక్‌లో ఎక్కి ఉండేవి గదా అనిపించింది.

ఢిల్లీ టూర్ ముగించే ముందు జనపథ్‌లోని పేవుమెంటు మార్కెట్లకు వెళ్ళి మా బానులాంటి వాళ్ళకోనం జ్ఞాపికలు కొందామనిపించింది. ఆఫీనులో తప్పనిసరి పని ఉండి మా వాడు వెళ్ళిపోయాడు. ఆడాళ్ళిద్దరూ కబుర్లతో "మేవు రావు" అన్నారు. కావలిస్తే పిల్లల్ని తీసుకుపొండి అన్నారు. మళ్ళా మెడకా డోళ్ళు ఎందుకులే అని ఒక్కణ్ణే వెళ్ళాను.

పేవుమెంట్ల నిండా చిత్రవిచిత్రమైన సామాన్లు.

కానీ, వాటన్నిటికన్నా విచిత్రమైన విశేషం ఆ జనపథ్‌లో కనిపించింది.

ఓ ముక్కు. అవును ముక్కే. తెల్లాయన ముక్కు. నిడుపాటి ముక్కు.

అక్టోబరు నెల కదా, ఢిల్లీకి విదేశీ టూరిస్ట్ పక్షులు మందలుగా వచ్చి వాలే నెల అది. అనేక రంగుల మనుషులు. అనేక ఆకారాల మనుషులు. చప్పిడి జపాను ముక్కుల నుంచి కోటేరు దీరిన గ్రీకు నాసికల దాకా అనేకానేక రకాల మనుషులు. ఆ రకరకాల మనుషుల మధ్య ఆ తెల్లాయన నిడుపాటి ముక్కు నన్ను తోక పట్టుకొని నిలవేసింది.

గరుత్మంతుడి గురించి విన్నాం. గద్ద ముక్కు అన్న పోలిక ఉండనే ఉంది. కానీ, ఇదేం ముక్కు. ఉండబట్టలేక పలకరించాను.

"నా పేరు పినాకియో. అమెరికాలో నివాసం. నాతో నీకేం పనీ?" పొడిచినట్టూ, కరిచినట్టూ మాట్లాడాయన. ఆయన్ని మాటల్లో పెట్టి అసలు విషయం బయటపెట్టించేనరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది.

"పాతికేళ్ళ క్రితం వచ్చిందీ నమన్య. అబద్ధం చెప్పినప్పుడల్లా ముక్కు పెరుగుతుంది. నిజం చెపితే తగ్గుతుంది. నగటు నిడివి రెండు అంగుళాలు. వదిలించుకొందామని ప్రయత్నించాను. పడలేదు. నర్జరీ చేయించాను. మళ్ళీ పెరిగింది. సైక్రియాటిస్టును కలిశాను. "ఈ ప్రపంచంలో బతికే నీకు ఈ నమన్య తప్పదు. అడవులకు వెళ్ళి ముక్కు మూనుకొని తపన్సు చేసుకొంటే తప్ప పరిష్కారం లేదు" అనేశాడు. అడవుల నంగతి ఎలా ఉన్నా మీ రిషీకేశ్‌లో ఎవరో నాసికానంద స్వామి ఉన్నారట. కలిస్తే ఫలితముంటుందేమోనని వచ్చాను." ఎంతైనా అప్రాచ్యుడు గదా - ఏ నంకోచమూ లేకుండా తన నమన్య వివరించాడు పినాకియో.


అతి కష్టంమీద నంతోషం ఆపుకొన్నాను. నాలాంటి నమన్య ఉన్న మరో ప్రాణి ఈ ప్రపంచంలో ఉన్నాడనే నరికి నంబరం కలిగింది. పుట్టుకలోనే విడిపోయిన కవల తమ్ముణ్ణి కలసిన అనుభూతి కలిగింది. నడిరోడ్డు మీద నాట్యం చెయ్యాలనిపించింది. గొంతెత్తి పాడాలనిపించింది.

నా రహన్యం అతనికి చెప్పేశాను. నా రహన్యం ఎరిగిన రెండో వ్యక్తి పినాకియో.

స్నేహంగా నవ్వాడు. అంతే, అంతకన్నా ఆనక్తి చూపించలేదు. తోక నమన్యను నేను జీవన్మరణ నమన్యగా భావించుకొంటున్నానుగానీ, ఆయనకు తన ముక్కు గురించి మరీ ఏపంత ఆందోళన ఉన్నట్టు కనిపించ లేదు. వాళ్ళవాళ్ళ దేశాల్లో ఇలాంటి వింతలూ విపరీతాలూ నర్వసామాన్యం గాబోలు. విషయాన్ని ఆయన సీరియస్‌గా తీసుకొన్నట్టు కనిపించ లేదు. నేనూ అలాంటి స్థిర మనస్తత్వాన్ని అలవరచుకోవాలని నిర్ణయించుకొన్నాను.

* * *

కానీ, కుక్క తోక వంకర. మనిషి మనను మర్కటం. నా తోక నమన్య అవిరామంగా నా తలను తినెయ్యడాన్ని ఏమాత్రం అరికట్టలేకపోయాను.



ఢిల్లీ యాత్రను జయప్రదంగా ముగించుకొని వచ్చి ఆఫీను పనిలో పడీపడగానే తెలియవచ్చింది - పక్క సీటు సుందరానికి లూనా నుంచి వెస్పాకు ప్రమోషన్ వచ్చిందని. వివరాలడిగాను. పి.ఎఫ్ లోన్ అన్నాడు.

"నరే గానీ స్కూటరు నడపడం వచ్చా?" అడిగాను.

"లైసెన్స్ ఉంది." బింకంగా చెప్పాడు సుందరం.

"లైసెన్స్‌దేవుందీ? నేనడుగుతోంది నడపడం వచ్చా అని." రెట్టించాను.

రాదని ఒప్పేసుకొన్నాడు. నేర్చుకొంటున్నానని చెప్పుకొచ్చాడు.

నేనూ పి.ఎఫ్ లోన్ దారిబట్టి, అర మిల్లీ మీటరు తోకను పెంచుకొని, కవాసాకీ బజాజ్ కొనుక్కొన్నాను. 'నో ప్రాబ్లెం' అనుకొన్నాను.

కానీ, లైసెన్స్ దగ్గర నమన్య వచ్చిపడింది. ఆర్టీవో ఆఫీను చుట్టూ సెలవులు పెట్టి మరీ తిరిగాక ఆ తిరుగుడు అర్థరహితమనీ, నేను కలవవలసింది ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ని గాక ఆఫీను ఆవరణలోని అనధికార ఏజంటుననీ బోధపడింది. రెండు పెద్ద నోట్లు చేతులు మారి - ఓ మిల్లీ మీటర్నీ జలదరింపునూ నంతరించుకొని - నేను తిరిగి వచ్చేస్తోంటే ఏజంటు అన్నాడు, "వారం రోజుల తర్వాత మరోసారి రావాలి సార్" అని.

"ఎందుకూ? సెలవు దండగ. మరో వంద నోటుతో పనవుతుందా?" అడిగాను.

"అవదు సార్. మా ఆఫీనరుగారు మనిషిని చూడకుండా లైసెన్సివ్వడం మానేశారు."

"ఏమీ? మరో వంద వస్తోంటే ఆయనకు చేదా?"

"ఒకరకంగా చేదే. పోయినేడాది ఓ మోనంలో ఇరుక్కొని మనిషిని చూడకుండా లైసెన్స్ నంతకం పెట్టారాయన. పేపర్లలో గగ్గోలయింది. ఉద్యోగం ఊడినంత పనయింది. అంచేత అదనపు వందలు త్యాగం చేసి ఉద్యోగం కాపాడు కొంటున్నారు." వివరించాడు.

పోన్లే, మరో అర మిల్లీ మీటరు పెంచుకోవలసిన అవనరం తప్పింది గదా అనిపించింది.

* * *

"ఏం వాయ్. డబ్బంటే చేదా? మా కొలీగ్ ఒకతను వచ్చి పరామర్శించాడు. టియ్యే బిల్లులు పాస్ చేసే సెక్షను సూపర్నైజరతను.

"చేదా పాడా! ఎంత డబ్బూ చాలడం లేదు. వచ్చే మార్గముంటే చెప్పి పుణ్యంగట్టుకో."

"నీ బిల్లు చూశాను. నాంపల్లి నుంచి కూకట్‌పల్లికి ఆటోకి యాభై రూపాయలు క్లెయిమ్ చేశావు. బానే ఉంది. యాభై అవుతుందని అందరికీ తెలును. కానీ, 'దూరం' అన్న చోట పదిహేను కిలోమీటర్లనే రాశావు. మన ఆఫీను రూల్సు ప్రకారం కిలోమీటరుకు రెండు రూపాయలకన్నా ఎక్కువ రాదు. ఆ లెక్కన నీకు ఇరవై రూపాయల కోత పడుతుంది." వివరించాడు.

"మరేవిటీ మార్గం?"

"సింపుల్. దూరం అన్నచోట పాతిక కిలోమీటర్లని రాయి. నేను చూసీ చూడనట్టు ఊరుకొంటాను."

ఆలోచనలో పడ్డాను. "వద్దులే. ఇరవై రూపాయల కోనం అంత పెద్ద అబద్ధం చెప్పడం నాకిష్టం లేదు." కష్టంగానే అన్నాను.

వెన్నుపూనలో పులకరింత. మండుటెండలో

కూజా నీళ్ళు తాగిన తియ్యని అనుభూతి. కరెంటు లేని వేసవి రాత్రి ఎక్కణ్ణించో చల్లని గాలి వచ్చి వింజామరలు వీచిన భావన.

ఓ అర మిల్లీమీటరు తగ్గిందని బోధపడింది.

అటెండరొచ్చి బాసు పిలుస్తున్నాడన్న శ్రీముఖం అందించాడు.

వెళ్ళాను. మొహం డీలా పడింది. మళ్ళా ఏం వచ్చిందో?

"ఏవిటండీ ఇదీ? ఈ రిపోర్టు మిమ్మల్నీ, ఆ బీటూ సెక్షను మూర్తిగారినీ కలసి తయారు చెయ్యమన్నాను. ఇద్దరూ కలసి చేశారు గదా అని నేను సరిగ్గా చదవకుండానే సంతకం పెట్టి పంపించాను. తిరుగు టపాలో తిరిగొచ్చింది. ఆ మూడో కాలమ్ చూశారా? కూడాల్సిందిపోయి తీసివేత చేశారు. పాతిక వేలు తేడా వచ్చింది."

కోప్పడదామని మొదలుపెట్టాడు గానీ చివరికి ఏడుపు స్థాయికి దిగింది ఆయన గొంతు.

రిపోర్ట్ చూశాను. నిజమే. పొరపాటు జరిగింది. తేడా ఏ పాతిక రూపాయలో అయితే పెద్దగా సమస్య ఉండేది గాదు. పాతిక వేలంటే మరి కొంపలంటుకొంటాయి. చెక్ చెయ్యకుండా సంతకం పెట్టింది మా బాసుడు. బింకంగా కూర్చుంటే చేతికి మట్టి అంటకుండా చూసుకోవచ్చు. అయినా, ప్రాణం ఒప్పలేదు. ఆలోచించాను.

"సార్, పెద్ద పొరపాటే దొర్లిపోయింది. మనం ముగ్గురం తప్పుకు బాధ్యత తీసుకొందాం. బహుశా ఇంకా జరగవలసిన నష్టం జరిగి ఉండకపోవచ్చు. ఆ రిపోర్టు ఇంకా మన రీజినల్ ఆఫీసులోనే ఉందనుకొంటాను. వాళ్ళు దాన్ని హెడ్డాఫీసుకు పంపేలోగా మనం సరిదిద్దుదాం. మందలింపులూ, పనిష్మెంట్లూ వస్తే సరిసమానంగా పంచుకొందాం" అని ప్రతిపాదించాను.

మా పెద్దాయన మొహం మబ్బు వీడింది. గబగబా డామేజి కంట్రోలు ప్రయత్నంలో పడ్డాడు. ఈలోగా నా వెన్నుపూస వేణువులా పాడింది. వీణలా మోగింది. ఓ అర మిల్లీమీటరు తగ్గిందని అర్థమయింది.

తోక పెరుగుడూ, తోక తరుగుడూనే గదా జీవితమంటే!

* * *

నాకా పినాకియోనే గుర్తొస్తున్నాడు.

ఎంత స్థితప్రజ్ఞత! ముక్కు గురించి చీకూ చింతా లేనట్టే కనిపించాడు. నాకా స్థయిర్యం లేదేమీ? సంగతి బయట పెట్టి రహస్య జీవితం చాలించే ధైర్యం లేదేమీ?

బయటపెడితే గోలగోలవుతుంది. పేపర్లు రాస్తాయి. రేడియోలు కోడై కూస్తాయి. అందరూ నవ్వుతారు. అవహేళన చేస్తారు. అదంతా భరించగలనా? నేను భరించినా పెళ్ళాం పిల్లల మాటేవిటీ? 'మీ నాన్నకు అబద్ధాలు చెప్పడం వల్ల వచ్చిన తోకుందంట గదా' అని స్కూల్లో పిల్లలు ప్రశ్నిస్తే మా పిల్లలు బతగ్గలరా?

అసలు నాకే ఎందుకూ ఈ శిక్షా? రాజకీయ నాయకులకుండాలి. అధికార గణానికి ఉండాలి. వాళ్ళంతా టింగురంగామంటూ తిరుగుతోంటే నాకేవిటీ ఈ అవస్థా? చంద్రకాంత స్వాములూ, ధీర గంభీర యోగులూ- వాళ్ళకి లేని తోక నాకెందుకు దాపురించింది? అసలు

**రకరకాల మనుషుల మధ్య ఆ తెల్లాయన నిడుపాటి ముక్కు నన్ను తోకపట్టుకొని నిలవేసింది.**

అన్నిటికీ తెగించి ఈ తోకను అబద్ధాల ఎరువు వేసి మరింతగా పెంచి దాన్ని జనాలకు ప్రదర్శించి సొమ్ము చేసుకుంటేనో!

పిచ్చి ఆలోచన. అయినా, ప్రతి విషయానికీ ఒక అంతమంటూ ఉంటుంది. పుట్టిన ప్రతివాడూ చచ్చి తీరవలసిన విధంగా.

నాకు అలాంటి సందర్భం ఒకటి వచ్చిపడింది. విషమ సమస్య. అగ్నిపరీక్ష. జీవన్మరణ సమస్య. పరీక్షలో ఓడితే గొడవే లేదు. మార్పు ఉండదు. నెగ్గితే మాత్రం నా తోక మూడు మీటర్లవడం ఖాయం. నా రహస్యం బట్టబయలవడం ఖాయం. నా జీవితం తిరుగులేని మలుపు తిరగడం ఖాయం.

అతను నా సహోద్యోగి. బహు కుటుంబీకుడు. మంచి మనిషి. ముక్కు సూటిమనిషి. నాకు అతనంటే అభిమానం. ఇష్టం. వివరణకందని అభిమానం అది. అతని ముక్కుసూటితనమే ఆ అభిమానానికి పునాదిగావచ్చు.

అంతటి నిజాయితీపరుడూ ఏసీబీ వాళ్ళ వలలో ఇరుక్కున్నాడు. ఆ ఇరికించిన మనిషి మాకు చిరపరిచితుడే. ఓ చిల్లర కాంట్రాక్టరు. ఆఫీసుకు రావడం, సహకరించే వాళ్ళ చేతులు తడపడం, మాబోటి వాళ్ళకేసి గుర్రుగా చూడడం మాకు అనుభవమే.

మాలాంటి మొండి ఘటాలకు పాఠం చెప్పాలని గాబోలు తెలివిగా మావాడిని వలలో ఇరికించాడు. లంచం కోరాడని ఏసీబీలో ఫిర్యాదు చేశాడు. దానికి అనువుగా ఆధారాలు కల్పించగలిగాడు.

ఏసీబీ మావాడి మీద కేసు పెట్టింది. సస్పెండయ్యాడు. కేసు విచారణకొచ్చింది. సాక్ష్యాలు మావాడికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఉద్యోగం ఊడే పరిస్థితి వచ్చింది.

నాకు ఒక్కటే మార్గం కనిపించింది. ముల్లును ముల్లుతో తియ్యడం, వజ్రాన్ని వజ్రంతో కొయ్యడం. అబద్ధాన్ని అబద్ధంతో ఎదుర్కోవడం.

ఆ కాంట్రాక్టరుకు లంచాలు ఇవ్వడం అలవాటనీ, బేరసారాల్లో తేడాలు రావడం వల్లనే ఏసీబీకి ఉప్పందించాడుగానీ, నిజాయితీ పొంగిపొర్లడం వల్లగాదనీ చెప్పాలి. రుజువు చెయ్యాలి. చేస్తే మావాడి ఉద్యోగం నిలబడుతుంది.

కానీ, కాంట్రాక్టరు దగ్గర లంచాలు తింటున్నామని వాఙ్మూలం ఇచ్చేదెవరు? ఇస్తే దారినపోయే పెద్దమ్మ తలకు చుట్టుకోదూ? మరి నేనే పూనుకోవాలి.

నాకూ లంచాలు ఇచ్చాడనీ, ఇవ్వడం అలవాటనీ అబద్ధం చెప్పాలి.

చెబితే కేసు దారి మళ్ళుతుంది. మావాడు గట్టున పడతాడు. కాంట్రాక్టరు కొంతవరకూ మునుగుతాడు. మరేం పర్లేదు. మునిగినా నష్టం లేదు.

కానీ, ఉరుమురిమి మంగళం మీద పడుతుంది. కేసు నానెత్తికి చుట్టుకోవచ్చు. "లంచాలు తింటావా బదుద్దాయ్" అని నాకు అక్షింతలు పడొచ్చు. ఇంక్రిమెంటు పోవడమో, ఒక మెట్టు కిందికి రివర్ట్ అవడమో జరగొచ్చు.

కానీ, నేను ముందుకెళ్ళి పిల్లి మెడలో గంట కడితే మిగతా ఎలుకలు కదలి వచ్చి కలసికట్టుగా నిజాలు, అబద్ధాలు చెప్పి పిల్లి ఆట కట్టిస్తాయి.

సిద్ధపడ్డాను. నే చెప్పే అబద్ధం వల్ల నా తోక లంకంతా చుట్టి వస్తుందని తెలిసీ సిద్ధపడ్డాను అబద్ధం చెప్పేశాను. వెన్నుపూసకు వేలవోల్టు షాకు తగులుతుందని ఊహించాను. దీపావళి పాముబిళ్ళలా నా తోక బుసబుసా పొంగి పొరలి బట్టల్ని చీల్చుకొని బయట పడుతుందని అనుకొన్నాను.

కానీ, వెన్నునిండా వేయి వేణువులు మోగిన గానం. లక్షలాది కోయిలల కుహూరవం. శతకోటి సితారల సుతారపు నాదం! బోధివృక్షపు సిద్ధార్థుని వెన్ను కూడా ఇలాంటి పులకరింతకే గురి అయిందా?

భయంభయంగా తడిమి చూసుకొన్నాను. తోక కనవడలేదు. పూర్తిగా, సంపూర్తిగా మాయమయిపోయింది! ■

